## క్లుప్తంగా

### సామగ్రి తరలింపు



ఫర్నీచర్, సామాన్లు తరలిస్తున్న సిబ్బంది

**విజయనగరం ఫూల్‌బాగ్:** భూగర్భగనుల శాఖ ఎ.డి కార్యాలయం విజయనగరం జిల్లా నుంచి నర్సీపట్నానికి మారుస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కార్యాలయ సామాగ్రి, ఫర్నీచర్‌ను బుధవారం తరలించారు. అలాగే ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యాలయంగా ఉన్నప్పటి భూగర్భ గనుల శాఖ రికార్డులను వేరుచేసి విజయనగరం జిల్లాకు సంబంధించిన రికార్డులను విజయనగరం డీడీ కార్యాలయానికి.. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించిన రికార్డులను పార్వతీపురం జిల్లా కార్యాలయానికి తరలించారు.

### ప్రజా ఉద్యమాల బలోపేతమే అసలైన నివాళి

**విజయనగరం ఫూల్‌బాగ్:** మతోన్మాదం, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయడమే రెడ్డి శ్రీరామమూర్తికి నిజమైన నివాళి అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాస అన్నారు. బుధవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో సీపీఎం నేత శ్రీరామమూర్తి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జగన్‌మోహన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి. రమణ, సీఐటీయూ జిల్లా నాయకుడు రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రాము, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్, తదితరులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్రకు మహర్దశ..

**భోగాపురం:** జిల్లాలోని భోగాపురం వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టనుందని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయ నిర్మాణంతో ఎంతో మందికి ఉద్యోగాలు వస్తాయని, అలాగే ప్రత్యక్షంగా.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల కల్పనలో ఉత్తరాంధ్రులకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

### శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

**చీపురుపల్లి రూరల్:** హిందూ దేవాలయాల పరిరక్షణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రామాలయాలు, శివాలయాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖ నుంచి ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసిందని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. మండలంలోని పుర్రేయవలసలో శివాలయం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యేంత వరకు గ్రామపెద్దలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి అనంతం, కంది పాపినాయుడు, కంది అప్పారావు, జమ్ము అప్పలనాయుడు, కంది శ్రీరాములు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### వెంకటాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



చిన్నారుల హెల్త్‌చెకప్ చేస్తున్న డాక్టర్ సుష్మ

**గజపతినగరం:** మండలంలోని ఎం.వెంకటాపురంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ 109 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.


### వేసవి శిక్షణా శిబిరం

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గరివిడి పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో గురువారం నుంచి వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు వాలీబాల్ కోచ్‌లు సీహెచ్.సాంబమూర్తి, ఎం.గోపాలరావు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు వాలీబాల్ గేమ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వరాల జల్లు...

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జిల్లాపై వరాల జల్లు కురిపించారు. భోగాపురం మండలంలో నిర్మించనున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే పూసపాటిరేగ మండలం చింతపల్లిలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్, తారకరామ తీర్థ సాగర్ పెండింగ్ పనుల పూర్తికి భూమిపూజ చేశారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భగాపురం మండలం ఎ. రావివలస వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేరుకోగానే, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



సీఎం జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ముఖ్యమంత్రికి గిరిజన ఉత్పత్తులు అందజేస్తున్న జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ దీపికా పాటిల్



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్



అభిమాన నాయకుడితో ఏపీ మారిటోరియం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా యాదవ సంఘ నాయకుడు మాన్యాల కృష్ణ



సీఎంతో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్ దంపతులు



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



జగనన్నకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



సీఎంతో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ డీవీజీ శంకరరావు కరచాలనం

## ఎయిర్ పోర్టుకు వైఎస్సార్ పేరుపెట్టాలి

• నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

**విజయనగరం:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేరు పెట్టాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, సస్యశ్యామలం చేసేందుకు తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును కూడా మంజూరు చేశారని చెప్పారు. అందువల్ల విమానాశ్రయానికి వైఎస్సార్‌పేరు, టెర్మినల్స్‌కు కొమ్మూరి అప్పడుదొర, పెనుమత్స సాంబశివరాజు పేర్లను పెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. గత ప్రభుత్వ హయాంలో విమానాశ్రయానికి ఎటువంటి అనుమతులు రాకుండానే, భూసేకరణ కూడా జరగకుండానే, చంద్రబాబు నాయుడు ఉత్తుత్తి శంకుస్థాపన చేశారని విమర్శించారు. ఎయిర్‌పోర్ట్ పేరిట చంద్రబాబు ప్రభుత్వం 5,600 ఎకరాల భూసేకరణ చేసేందుకు యత్నిస్తే అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంత మొత్తంలో భూములు అవసరం లేదని పోరాటం చేశారన్నారు. 2019 అధికారంలోకి వచ్చిన తరువాత తమ ప్రభుత్వం మంచి ప్యాకేజీ ఇచ్చి భూసేకరణ చేయడమే కాకుండా, 186 మంది నిర్వాసితులపై పెట్టిన 16 కేసులను తీసివేయించామని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల భోగాపురానికి గొప్ప భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రతిపక్ష టీడీపీ నేతలు ఎన్‌టీఆర్ పేరుతో ఉన్న తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి కనీసం నిధులు కేటాయించలేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టారన్నారు.

## క్రీస్తు ప్రేమను సమాజానికి చాటిచెప్పాలి



మాట్లాడుతున్న బ్రదర్ మైఖేల్ విజయకుమార్

**విజయనగరం టౌన్:** క్రీస్తు ప్రేమను సమాజానికి చాటి చెప్పాలని బ్రదర్ మైఖేల్ విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక వీటీ అగ్రహారం కొత్త మజ్జిపేటలో ఉన్న ఎస్‌టీసీ చర్చిలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో చర్చిలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. క్రైస్తవులకు రక్షణ కల్పించి, మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. పీటీసీ ప్రిన్సిపల్ టి. ఆనందబాబు మాట్లాడుతూ, క్రీస్తు నేర్పిన బోధనలు క్రియల రూపంలో సమాజానికి చూపించాలన్నారు. డాక్టర్ పి.ప్రేమానందం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బిషప్ ఎం.పాల్సన్, డాక్టర్ బి. ఉదయ్‌చంద్ర, రెవరెండ్ ఎస్.మధు, డి.ఎలీషా, సైమన్ సుధీర్, ఏసురత్నం, జయప్రకాష్, బిషప్ దేవప్రసాద్, అబ్రహం, ఎన్.జాన్, ఎం.దీపు, తదితరులు పాల్గొన్నారు.

### సాంస్కృతిక సందడి



చిన్నారుల నృత్యప్రదర్శన

**విజయనగరం:** సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. మహారాజ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో గాత్రం, సంక్షేమ పథకాలపై నృత్యం, రేలారే వెంకటేష్ బృందం జానపద నృత్యాలు అలరించాయి. వేపాడ అంబేడ్కర్ కళాబృందం నిర్వహించిన డప్పువాయిద్యాలు, జానపద గీతాలు సభకుహాజరయ్యేవారిని హుషారెత్తించాయి. నర్తనశాల డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యా శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ, సంగీత నృత్యకళాశాల పర్యవేక్షణలో సాంస్కృతిక ప్రదర్శనలు సాగాయి.

## • ట్రాఫిక్ జామ్..



చీపురుపల్లి–రాజాం ప్రధాన రహదారిలో నిలిచిపోయిన ట్రాఫిక్

**చీపురుపల్లి రూరల్:** చీపురుపల్లి–రాజాం ప్రధాన రహదారిలో బుధవారం భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రహదారికి ఆనుకుని ఉన్న జి.అగ్రహారం గ్రామంలో గ్రామదేవత పండగకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో రోడ్డు కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో సుమారు మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

### నివాళి..

**విజయనగరం టౌన్:** జ్యోతిష్య, రసాయన, భౌతిక, సంఖ్యా, సాముద్రికశాస్త్ర నిపుణులు, ప్రొఫెసర్ ఆర్యసోమయాజుల వెంకట సుబ్బారావు (92) మృతి తీరనిలోటని ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మండపాక రవి, ధవళ సర్వేశ్వరరావు, భీష్మారావు, బుచ్చిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి సోదరుడు ఆర్యసోమయాజుల కాశీపతిరావు జ్ఞాపకార్థం బుక్కావీధిలో సుమారు 240 అడుగుల పాత ఇంటిని పదేళ్ల కిందట సంగీత, సాహిత్యాల కోసం ఫ్రెండ్స్ ఫైనార్ట్స్, కౌముది పరిషత్, ఘంటసాల స్మారక కళాపీఠంలకు దానం చేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

### ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం

**విజయనగరం టౌన్:** ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు అన్నారు. ఈ మేరకు ఒడిశా రాష్ట్రంలో ప్రచారానికి ఉత్తరాంధ్ర భక్తులు బుధవారం పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ, శ్రీకాకుళం, రాయగడ, తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహిస్తామన్నారు.

### ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈగా అంకమ్మ చౌదరి

**విజయనగరం ఫోర్ట్:** ఏపీ వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఎస్ఈగా పి. అంకమ్మ చౌదరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఈఈ పోస్టు ఉండేది. ప్రభుత్వం కొత్తగా ఎస్ఈ పోస్టు కూడా కేటాయించింది. అదేవిధంగా ఈఈగా శ్రీకాకుళంలో పనిచేస్తున్న బీఎస్ ప్రసాద్ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన సత్యప్రభాకర్‌కు శ్రీకాకుళం బదిలీ జరిగింది.

### రీడింగ్ చైర్ల వితరణ



లైబ్రేరియన్ శ్రీధర్‌కు కుర్చీలు అందజేస్తున్న రామకృష్ణ

**శృంగవరపుకోట:** పట్టణంలో స్థానిక శాఖాగ్రంథాలయానికి వచ్చే పాఠకుల సౌకర్యార్థం ఉసిరి గ్రామానికి చెందిన న్యాయవాది పిల్లా రామకృష్ణ రూ.12 వేలు విలువ చేసే 20 రీడింగ్ చైర్లను అందజేశారు. వీటిని లైబ్రేరియన్ డి.శ్రీధర్‌కు బుధవారం అందజేశారు. లైబ్రేరియన్‌తో పాటు పాఠకులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### శ్మశానవాటిక హద్దుల నిర్ధారణ

**వేపాడ:** మండలంలో వీలుపర్తి పంచాయతీ దుంగాడ రెవెన్యూలో శ్మశానవాటికకి రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ధారించారు. శ్మశానవాటిక ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, వీఆర్వో రామానుజం బుధవారం చినదుంగాడ రెవెన్యూలో సర్వే నిర్వహించినట్లు హెచ్‌డీటీ సన్యాసినాయుడు తెలిపారు. సర్వే నెం.36/2లో 62 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. శ్మశానవాటిక హద్దులు నిర్ధారించారు. గురువారం అక్రమణలు తొలగించనున్నట్లు హెచ్‌డీటీ తెలిపారు.

### దివాకర్ మృతి తీరనిలోటు



పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శిష్టకరణ సంఘ ప్రతినిధులు

**విజయనగరం టౌన్:** ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ అకాల మృతి తీరనిలోటని శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో దివాకర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, బీసీలకు ఎంతో మేలు చేకూర్చిన ఘనత దివాకర్‌కే దక్కిందన్నారు. నివాళులర్పించిన వారిలో పట్టణశాఖ అధ్యక్షుడు కంటిమహంతి సంజీవరావు, ప్రధాన కార్యదర్శి త్యాడ ప్రసాద్, సంఘపెద్దలు ఎం.విశ్వేశ్వరరావు, త్రినాథ ప్రసాద్, మురళీ భగవాన్, సుధాకర్ పట్నాయక్, ఎంపీ తిరుపతిరావు, ఆనంద్ పట్నాయక్, ఎ.తిరుపతిరావు, భోగిల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో



నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**విజయనగరం ఫోర్ట్:** స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి సతీష్‌కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షరీఫ్, రహీమ్, సూరిబాబు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

### పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

**కొత్తవలస:** మండలంలోని రాజుపాత్రునిపాలెం గ్రామంలో చీపురవలసకు వెళ్లే రోడ్డులో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు శిథిలం కావడంతో రోడ్డుపై పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దివ్యాంగుల సేవలో గురుదేవా ట్రస్టు



దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు తొడుగుతున్న ఎస్ఐడీబీఐ డీఎండీ సత్యవెంకటరావు

• 200 మందికి కృత్రిమ అవయవాల పంపిణీ

**కొత్తవలస:** దివ్యాంగులకు ఉత్తమమైన సేవలు అందిస్తూ వారికి కొత్తజీవితాలు ప్రసాదించడంలో గురుదేవా చారిటిబుల్ చేస్తున్న కృషి వర్ణనాతీతమని చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ అఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ) డీఎండీ వి.సత్యవెంటరావు ప్రశంసించారు. కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టును ఎస్ఐడీబీఐ బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రస్టు అందింస్తున్న సేవలను,ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధునాతన హాస్పిటల్‌ను సందర్శించి ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు సేవాగుణాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సత్యవెంకటరావు మాట్లాడుతూ దివ్యాంగుల సేవలో జగదీష్‌బాబు మునిగితేలుతున్నారన్నారు. తన జీవితాన్ని సేవలకే అంకితం చేయడం గొప్పవిషయమన్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టుకు తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. అనంతరం 200 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, వీల్‌చైర్స్, కాలిఫర్స్, బ్లైండ్ స్టిక్స్, చెవిటి మిషన్‌లు తదితర ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐడీబీఐ సీజీఎం ఎస్.ఎస్.ఆచార్య, డీఎం ప్రవీణ్ పాల్గొన్నారు.